క్లుప్తంగా

అందరికీ చదువు మనందరి బాధ్యత



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సత్యనారాయణ

వెంకటాపురం(కె): అందరికీ చదువు మన అందరి బాధ్యత అని మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వీఏఓ లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండినప్రతి ఒక్కరికీ చదవడం.. రాయడం రావాలనే ఉద్దేశ్యంతో ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చదవడం.. రాయడం రాని వారిని గుర్తించి చదువు నేర్పించడానికి వలెంటరీ టీచర్స్‌ను గుర్తించి వారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. పదో తరగతి, ఇంటర్ పూర్తి చేయనివారు ఓపెన్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేయొచ్చని తెలిపారు .కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్స్ రాజు, సూర్యనారాయణ, ఆశోక్, ఎపీఎం అప్పారావు తదితరులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం అయిలయ్య

ఎస్‌ఎస్‌తాడ్వాయి: చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని బయ్యక్కపేట గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అయిలయ్య అన్నారు. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని బుధవారం పాఠశాలలోని గొత్తికోయ విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పంద్రాగస్టు రోజున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న గొత్తికోయ పిల్లలకు తెలుగు భాషలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారని తెలిపారు.

'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



ర్యాలీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ జవాన్ల ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమై పాత మార్కెట్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా సాగింది.

వాజేడులో..



వాజేడు: మండల కేంద్రంలో ఎస్సై జక్కుల సతీశ్, సీఆర్పీఎఫ్ 39 బెటాలియన్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు పట్టుకుని మండల కేంద్రంలోని ర్యాలీ నిర్వహించారు.

పశువుల అక్రమ రవాణా నేరం



పట్టుబడిన పశువుల వాహనం

ములుగు రూరల్: పశువుల రవాణా చట్టరీత్యా నేరమని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని బండారుపల్లి క్రాస్‌లో ఓ వాహనంలో అక్రమంగా పశువులను తరలిస్తుండగా వాహనాల తనిఖీలో పట్టుపడ్డారని తెలిపారు. వాహనంలో 4 ఆవులు, 2 ఎద్దులు ఉన్నాయని వెల్లడించారు. పశువులను తరలిస్తున్న వాహనం స్వాధీనం చేసుకుని డ్రైవర్, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను గోశాలకు తరలించామని అన్నారు. తనిఖీలలో ఎస్సై ఇమ్మాన్యూల్, సిబ్బంది పాల్గొన్నారు.

కదలవు.. బెదరవు

రోడ్లపైనే పశువుల తిష్ట
- వాహనదారులకు తప్పని తిప్పలు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ప్రధాన రహదారిపై ఉన్న పశువులు

వెంకటాపురం(కె): మండ కేంద్రంలోని ప్రధాన రహదారిపై పశువులు తిష్ట వేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నా పట్టించుకునేవారే లేని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులను రోడ్లపై లేకుండా చేసేందుకు పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు, పోలీస్ శాఖ సంయుక్తంగా చర్యలు చేపడితే పశువులను రోడ్ల పై లేకుండా చేసే అవకాశం ఉంది. మండల కేంద్రంలో పశువుల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు పశువులు నడిరోడ్డు పై పడుకోవడంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. రాత్రి సమయాల్లో వాహనదారులు పశువులను దాటుకొని వెళ్లడం సవాల్‌గా మారింది. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్, బస్టాండ్ సెంటర్, జగదాంబ సెంటర్‌లో పశువులు రోడ్డుపై రాత్రి సమయాల్లో పడుకొని ఉంటున్నాయి. దీంతో వాహనదారులు భయపడుతూనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతోపాటు పెద్ద వాహనాలు ఢీ కొట్టడంతో కొన్నిసార్లు పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయి.

పట్టించుకోని యజమానులు

మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో పశువులను రోడ్ల పైకి వదిలి యజమానులు తమకు ఏం సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. పశువులను రోడ్లపై వదలకుండా పశువుల యజమానులను కట్టిడి చేయాల్సిన సంబంధిత అధికారులు పట్టంచుకోవడంలేదు. దీంతో పశువులు రోడ్డుకు అడ్డంగా ఉంటూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

రోడ్లపై పశువులను కట్టడి చేయాలి



మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై పశువులను పంచాయతీ అధికారులు కట్టడి చేయాలి. పశువులు రోడ్లపై రాత్రి సమయాల్లో తిష్ట వేసి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

-ఆదినారాయణ, స్థానికుడు

అర్హులైన మహిళలను సంఘాల్లో చేర్పించాలి



వెంకటాపురం(కె): శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అప్పారావు

వాజేడు: అర్హత కలిగిన ప్రతీ మహిళను డ్వాక్రా సంఘాల్లో చేర్పించాలని వాజేడు ఏపీఎం సతీష్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవార మండల సమాఖ్య సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యం కోసం అర్హతలు ఉన్న ప్రతీ మహిళను సంఘాల్లో సభ్యులుగా చేర్చాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సీసీ మల్లాచారీ, భవాని, వీఓఏలు, తదితరులు ఉన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి

వెంకటాపురం(కె): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని సెర్ప్ ఏపీఎం అప్పారావు అన్నారు. బుధవారం సెర్ప్ కార్యాలయంలో మహిళ సమాఖ్య, స్వయం సహాయక సంఘాలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల్లో చేరని మహిళలను ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సంఘాల్లో చేర్పించాలని తెలిపారు. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, కిశోర బాలికలకు కొత్త సంఘాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. మహిళా సంఘాల్లో తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. సంఘంలోని సభ్యులకు రూ.రెండు లక్షల వరకు రుణ బీమా, రూ.పది లక్షల వరకు ప్రమాద బీమా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో సీసీలు నర్సయ్య, సమ్మయ్య, వెంకటలక్ష్మి, తదితరులు ఉన్నారు.



వాజేడు: మాట్లాడుతున్న ఏపీఎం సతీష్

జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

వాజేడు: భద్రాచలం నియోజకవర్గంలోనే వాజేడు మండలంలో జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులు సాగుతున్నాయని, వాజేడు మండలంలోనే తొలిగృహ ప్రవేశం మంత్రి చేతుల మీదుగా చేయిస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ తెలిపారు. వాజేడు మండలానికి బుధవారం వచ్చిన ఆయన పేరూరు, చంద్రుపట్ల, టేకులగూడెం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను స్వయంగా పరిశీలించారు. పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నాగేశ్వరావుకు గుర్తుగా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రారంభించి మాట్లాడారు. అదే విధంగా పిడుగు పాటుకు మృతి చెందిన అరికెల్ల వేణు కుటుంబాన్ని పరామర్శించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. పేరూరులో నిర్మాణాలు జరుపుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ లైన్ మార్చాలని, బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరగా తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం మండలకేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల స్థితిగతులతో పాటు బిల్లుల చెల్లింపులపై గ్రామ పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 90 శాతం మేర ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పనులు కొన సాగుతున్నాయని తెలిపారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ యగ్గడి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మ బోనాల పండుగ



మల్లూరులో బోనాలతో వెళ్తున్న మహిళలు



నర్సింహాసాగర్‌లో బోనాలు సమర్పిస్తున్న భక్తులు



వెంకటాపురం(ఎం): బోనాలతో పోచమ్మ గుడికి వెళ్తున్న మహిళలు



ఏటూరునాగారం: బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో వెళ్తున్న మహిళలు, భక్తులు

మంగపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాల పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా మల్లూరు, నర్సింహాసాగర్, బోరునర్సాపురం, కొత్తమల్లూరు, కమలాపురం తదితర గ్రామాల్లో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో డప్పు చప్పుళ్ల నడుమ బోనాలు తరలివెళ్లి ముత్యాలమ్మ తల్లికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పాడి పంటలు బాగుండాలని ప్రజలు సుఖసంతోషాలతో జీవించే విధంగా చల్లంగా దీవించాలని వేడుకుని కోళ్లు, మేకలను బలిచ్చారు.

పాలంపేటలో పోచమ్మతల్లి బోనాలు

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేటలో మాజీ సర్పంచ్ డోలి రజిత ఆధ్వర్యంలో మహిళలు పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. శ్రావణమాసం సందర్భంగా ప్రతి ఏటా పోచమ్మతల్లికి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని ఈసందర్భంగా గ్రామస్తులు తెలిపారు. అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రావణమాసంలో అమ్మవారిని పూజించి శ్రావణమాసం చివరివారంలో పోచమ్మతల్లికి మొక్కులు చెల్లించారు.

ఏటూరునాగారం: మండలంలో శ్రావణ మాసం సందర్భంగా పోశమ్మ బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. అమ్మవారి ప్రసాదాలు, కల్లు, కోళ్లు, మేకలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయలను కొట్టి బెల్లంశాఖ పోసి చల్లంగా చూడు తల్లి అని వేడుకున్నారు. మొక్కులు తీరాలని భక్తులు మర్రిచెట్టుకు ముడుపు కట్టారు. లక్ష్మీదేవరను సైతం భక్తులు పూజలు చేశారు. పోచమ్మ తల్లి వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించారు.

దోమల నివారణ మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని శ్రీరామ్ నగర్ ఎస్సీ కాలనీలో బుధవారం దోమల నివార్ణ మందును పిచికారీ చేశారు. పేరూరు వైద్యాధికారి రాహిల్ ఆధ్వర్యంలో ఈ దోమల నివారన మందును అన్ని ఇళ్లల్లో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి మందులను ఇచ్చారు. గ్రామంలో ఆరుగురికి జ్వరం ఉన్నట్లుగా గుర్తించి వారి నుంచి రక్తనమూనాలను సేకరించారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న భక్తులు

వాజేడు: మండల పరిధిలోని ఆర్లగూడెం గ్రామంలో బుధవారం గ్రామస్తులు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రూ.5,116 చందాగా ఇచ్చారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

మంగపేట: వర్షాకాలం ముగిసే వరకు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. మండలంలోని నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంటలో బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 57 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. 09 మంది జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తి పరిశుభ్రత పాటించాలని తెలిపారు. జ్వరం వస్తే వెంటనే పీహెచ్‌సీలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందితో కలిసి గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సారమ్మ, సీతమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తిమ్మంపేట, చెరుపల్లిలో..

మండలంలోని మంగపేట పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మంపేట, తిమ్మంపేట బీసీ కాలనీలో డాక్టర్ మనోజ్‌కుమార్, చెరుపల్లి ఎస్టీ(కొత్తగుంపు) కాలనీలో పల్లె దవాఖాన వైద్యాధికారి మనోజ్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 32 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న ఇద్దరికి ర్యాపిడ్ ఫీవర్ పరీక్షలు నిర్వహించారు. జలుబు, దగ్గు, ఒల్లు నొప్పులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

ఇంటింటి ఫీవర్ సర్వే

వెంకటాపురం(కె): మండల పరిధిలోని రామచంద్రాపురం, కమ్మరిగూడెం, వెంకటాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఇంట్లో ఎంత మంది కుటుంబ సభ్యులు ఉంటున్నారు. వారిలో ఎవరైన జ్వరంతో బాధపడుతున్నారా.. అని తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భాస్కర్, పవన్ కల్యాణ్, ఆశిష్, డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్ఈఓ కోటి రెడ్డి, సిబ్బంది యాకమ్మ, రామలక్ష్మి, తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం..



వెంకటాపురం(ఎ): అవగాహన కల్పిస్తున్న ఎస్సై



ములుగు రూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

వెంకటాపురం(ఎం): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ప్రభుత్వ సంకల్పంలో విద్యార్థులు, యువకులు భాగస్వాములు కావాలని వెంకటాపురం ఎస్సై రాజు పిలుపునిచ్చారు. మండలంలోని జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తానని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అమ్మకాలు , రవాణపై పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని చిడెం వారి వీధిలో విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిడెం వారి వీధికి చెందిన వనపర్తి చంద్రయ్యకు చెందిన పెంకుటింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చేలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో టీవీతోపాటు ఇంట్లోని సామగ్రి కాలిపోయాయి. సుమారు యాభై వేల నష్టం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఫాస్టాగ్ చెక్‌పోస్టులు తొలగించాలి

- సీపీఎం మండల కార్యదర్శి రఘుపతిరావు

వాజేడు: ఏటూరునాగారం, పస్రా వద్ద జాతీయ రహదారిపై అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ చెక్ పోస్టులను తొలగించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘుపతిరావు మాట్లాడుతూ జిల్లాలో రెండు చోట్ల ఫాస్టాగ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం చొరవ చూపి వెంటనే ఫాస్టాగ్ చెక్ పోస్టులను తొలగించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో దామోదర్, దేవయ్య, కృష్ణ బాబు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సాంబరాజు

వెంకటాపురం(ఎం): విద్యుత్ ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ రమేష్ తెలిపారు. విద్యుత్ ప్రమాదాలపై మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం సబ్ ఇంజనీర్ సాంబరాజు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ఐరన్ స్తంభాలను ముట్టుకోవద్దని, తెగిపోయిన, వేలాడే విద్యుత్ వైర్ల వద్దకు వెళ్లొద్దని తెలిపారు. తడి చేతులతో స్విచ్‌లను ఆన్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాధిక, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లారెడ్డి, అసిస్టెంట్ లైన్‌మెన్ రాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఏటూరునాగారం: పెండింగ్ వేతానాలు చెల్లించాలని మిషన్ భగీరథలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, లైన్‌మెన్లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో పనిచేసే కార్మికులు బుధవారం మండలంలోని రొయ్యూర్ మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద ఏఈ, కేబీఎస్ఆర్ కంపెనీ యజమాన్యానికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి వేతనాలు, రెండు సంవత్సరాల నుంచి పెంచిన వేతనాలు చెల్లించాలన్నారు. విధుల్లో ఏ ప్రమాదం జరిగిన కంపెనీ యజమాన్యానిదే బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసింద్రి, రాజేశ్, పవన్‌కుమార్, రాజు, నవీన్, శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కూలి చెల్లించాలని ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో 18 పంచాయతీల కార్మికులు పనులు చేసి రెండు నెలలు కావస్తున్నా డబ్బులు చెల్లించలేదని అన్నారు. డబ్బులు తక్షణమే చెల్లించాలని.. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ల నర్సింహచారి, కంతి వెంకయ్య, శ్రీను, నిర్మల, రజిత, తదితరులు ఉన్నారు.